

# రూ.100 లుక్ మొత్తం ఛేంజ్ చేసేయొచ్చు..



అందంగా, స్టైలిష్‌గా కనిపించాలని యువత ఎంతగానో కోరుకుంటారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అది చాలా ముఖ్యం కూడా. ప్రస్తుతం చాలా మంది మన లుక్స్‌ను బట్టే మనల్ని జడ్జ్ చేస్తుంటారు. అది కరెక్ట్ కాదని తెలిసినా కూడా అది మానుకోలేరు. ఇలాంటి ప్రపంచంలో జీవితంలో ముందుకు సాగాలంటే తప్పకుండా స్టైలిష్‌గా, సమాజానికి తగ్గట్టుగా, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా ఉండాలి. అయితే స్టైలిష్‌గా ఉండటం అనేది చాలా ఖర్చుతో కూడుకున్న పనిగా అందరూ అనుకుంటారు. బ్రాండెడ్ డ్రెస్‌లు వేయాలి, బ్రాండెడ్ యాక్సెసరీస్ కొనాలి అని భావిస్తారు. కానీ అంత ఖర్చు చేయాల్సిన అవసరం లేదని, ఒక్కో వస్తువుకు రూ.100 ఖర్చు చేసినా కూడా స్టైలిష్‌గా కనిపించొచ్చని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు. అతి తక్కువ ఖర్చుతోనే చాలా అందంగా కనిపించొచ్చని అంటున్నారు. ఎప్పుడైనా అర్జెంట్‌గా ఫంక్షన్‌కు వెళ్లాల్సిన వచ్చిన సమయాల్లో కూడా చిన్నచిన్న టిప్స్ పాటించడం ద్వారా చాలా స్టైలిష్‌గా కనిపించొచ్చని చెప్తున్నారు. మరి ఆ టిప్స్ ట్రిక్స్ ఏంటో తెలుసుకుందామా..

స్టైలిష్ జ్యువెలరీ : చెవిపోగులు, చైన్లు, బ్రాస్లెట్లు లేదా ఉంగరాలు వంటి స్టైలిష్ ఆభరణాలను రూ.100కి కొనుగోలు చేయవచ్చు. ఇది మీ రూపానికి కొంత గ్లామర్, శైలిని జోడిస్తుంది. ఇవి మార్కెట్లో చాలా దొరుకుతాయి.

రంగురంగుల స్కార్ఫ్ : మీరు రూ.100కి రంగురంగుల స్కార్ఫ్ కొనుగోలు చేయవచ్చు. ఇది మీ రూపాన్ని మరింత స్టైలిష్‌గా మారుస్తుంది. మీరు దానిని మీ మెడ చుట్టూ స్టైల్ చేసి కట్టుకోవచ్చు. ఇది అందరిలో మిమ్మల్ని ప్రత్యేకంగా చూపిస్తుంది.

మేకప్ : మీరు మేకప్ వేసుకుంటే అది మీ రూపాన్ని ప్రకాశవంతం చేస్తుంది. సింపుల్ లుక్ కోసం మీరు కాజల్, లిప్‌స్టిక్‌ని ఉపయోగించవచ్చు. మీరు మరింత స్టైలిష్ లుక్ కావాలనుకుంటే మీరు ఐషాడో, బ్లష్‌ని కూడా ఉపయోగించవచ్చు. ఇవి మార్కెట్లో చాలా తక్కువ ధరకు దొరుకుతున్నాయి.



కేశాలంకరణ : మీరు మీ జుట్టును స్టైలిష్‌గా కట్టుకోవడం ద్వారా మీ రూపాన్ని మెరుగుపరచుకోవచ్చు. మీరు పోనీటైల్ తయారు చేయవచ్చు. మీరు మీ జుట్టును రంగుల హెయిర్ బ్యాండ్‌లు, హెయిర్ క్లిప్‌లతో అలంకరించవచ్చు.

బట్టలు సరైన ఎంపిక : అతి తక్కువ ధరతో చౌక బజార్లు, పాతకాలపు దుకాణాల నుండి స్టైలిష్ దుస్తులను కొనుగోలు చేయవచ్చు. మీ శరీరాకృతిని బట్టి దుస్తులను ఎంచుకోవాలి. మీరు వివిధ నియమాలతో ప్రయోగాలు చేయవచ్చు.

సన్ గ్లాసెస్ : మీరు స్టైలిష్ సన్ గ్లాసెస్ రూ.100కు పొందవచ్చు. ఇది మీ రూపానికి కొత్త లుక్ తీసుకువస్తుంది.

క్యాప్ : మీరు స్టైలిష్ క్యాప్‌ని అతి తక్కువ ధరలో కొనుక్కోవచ్చు. ఇది మీ రూపానికి కొంత వ్యక్తిత్వం, శైలిని జోడిస్తుంది.

బెల్ట్ : మీరు స్టైలిష్ బెల్ట్‌ను కూడా కొనుక్కోవచ్చు. ఇది అధునాతనతను, మంచి లుక్‌ను ఇస్తుంది.

గడియారాలు : మీరు స్టైలిష్ వాచ్‌ను రూ.100కు కొనుక్కోవచ్చు. ఇది అందరిలో మీరు ప్రత్యేకంగా ఉండేలా చేస్తుంది.

షూస్ : రూ. 100, 200 పెడితే చౌక మార్కెట్లు లేదా ఇతర షాపుల నుండి స్టైలిష్ షూలను కొనుగోలు చేయవచ్చు. మీకు సౌకర్యవంతంగా, మీ రూపానికి సరిపోయే షూలను మీరు ఎంచుకోవాలి.

# బ్రేక్ ఫాస్ట్ మానేస్తే ఇన్ని తిప్పలా..!



రోజూ ఉదయం సమయంలో అల్పాహారం తినడం ప్రతిఒక్కరికీ అలవాటు ఉంటుంది. దాదాపు ప్రతి ఒక్కరూ అల్పాహారంతోనే తమ రోజును ప్రారంభిస్తారు. కానీ ప్రస్తుతం పెరుగుతున్న ఆరోగ్యంపై శ్రద్ధతో చాలా మంది డైటింగ్ బాట పడుతున్నారు. అందులో భాగంగా ఎక్కువ శాతం మంది బ్రేక్‌ఫాస్ట్‌కు బైబై చెప్తుంటారు. కానీ ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. అల్పాహారమే కాదా అనుకుంటే అంతులేని సమస్యలా మారే ప్రమాదాలు కూడా ఉన్నాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. ప్రతి ఒక్కరికీ అల్పాహారం చాలా ముఖ్యమని, ఇది మన ఆరోగ్యాన్ని రక్షించడంలో కీలకంగా ఉంటుందని కూడా చెప్తున్నారు. నిజంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికే టిఫిన్ మానేద్దామని అనుకుంటుంటే టిఫిన్ స్థానంలో ఆయిల్ ఫుడ్‌కు స్వస్తి పలికి మరేదైనా పోషకాహారం తీసుకోవడం మేలు చేస్తుందని, అలా కాదని ఒక్కసారిగా టిఫిన్ తినడం మానేస్తే అది మేలు కన్నా కీడే ఎక్కువగా చేస్తుందని చెప్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఇంతకీ ఒక్కసారిగా టిఫిన్ చేయడం మానేస్తే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయంటే..

చికాకు: అల్పాహారం తీసుకోకపోవడంతో అందరికీ వచ్చే తొలి ఇబ్బంది.. చిరాకు. కడుపులో ఆకలి కేకలు పెడుతుంటే.. తొలుత వచ్చేది చికాకే. న్యూరోట్రాన్స్‌మిటర్ సెరోటోనిన్ మన మానసిక స్థితిని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని నిపుణులు చెప్తున్నారు. మనం అల్పాహారం తీసుకోవడం మానేయడం వల్ల ఈ సెరోటోనిన్ స్థాయిలు దెబ్బతింటాయి. దీని వల్ల చికాకు, ఆందోళన, నిరాశ లక్షణాలు అధికమవుతాయని వైద్యులు చెప్తున్నారు.

మెటబాలిక్ సిండ్రోమ్: టిఫిన్ తీసుకోకపోవడం వల్ల మన మెటబాలిక్ సిస్టమ్ దెబ్బతింటోంది. దీని వల్ల మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని అధికమవుతోంది. ఇది గుండె జబ్బులు, హార్ట్ ఎటాక్, టైప్ 2 డయాబెటీస్ వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు అధికమవుతాయి.

పోషకాల కొరత: రోజూ తీసుకునే అల్పాహారాన్ని ఒక్కసారిగా మానేయడం, అలాగే కొనసాగించడం వల్ల శరీరానికి కావాల్సిన, తరచుగా వచ్చే పోషకాల లోటు ఏర్పడుతుంది. దాంతో పాటుగా మన శరీరంలోని విటమిన్లు, మినరల్స్, ఫైబర్ వంటి అవసరమైన పోషకాలు లోపించే ప్రమాదం ఉంది. ఇదొక్కటే అనేక వ్యాధులకు కారణం అయ్యే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్న మాట.

గుండె జబ్బులు: అల్పాహారం తీసుకోవడం ఒక్కసారిగా మానేయడం వల్ల గుండె పోటు, రక్తపోటు పెరుగుతాయి. గుండె సంబంధిత అనేక వ్యాధులు వచ్చే ఛాన్స్‌లు కూడా అధికం అవుతాయి. ఇది తీవ్రస్థాయిలో ఉండే అవకాశం కూడా ఉందని నిపుణులు అంటున్నారు.

అధిక బరువు: ఏ బరువు తగ్గుదామని టిఫిన్ మానేయాలని అనుకుంటున్నారో.. వారు బరువు అధికంగా పెరిగే ప్రమాదం కూడా ఉందని నిపుణులు చెప్తున్నారు. కాగా ఈ సమయంలో పెరిగే బరువు అనేక వ్యాధులకు కారణం అవుతుందని చెప్తున్నారు. సాధారణంగానే అల్పాహారం తీసుకోకపోవడం వల్ల మధ్యాహ్న భోజనం అధికంగా తీసుకుంటాం. దాని వల్ల బరువు పెరిగే అవకాశాలు పెరుగుతాయి. మన మెటబాలిక్ సిస్టమ్ దెబ్బతినడం వల్ల బరువు వేగంగా పెరుగుతుందని అంటున్నారు నిపుణులు.

అంతేకాకుండా మన జీవితంలో దేనినైనా ఒక్కసారిగా మానేయడం వల్ల నెగిటివ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా ఉండే ప్రమాదం ఉందని, కాబట్టి అది చెడు అలవాటైనా, మంచి కోసం చేస్తున్న మార్పైనా చిన్నచిన్నగా చేయడం లేదా వైద్యుల సలహా మేరకు చేయడం మంచిదని అంటున్నారు నిపుణులు.

